


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**72**

**(6 ఆగస్టు 68, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

"**ఈ కాలంలో** కుహనా భక్తుల సంఖ్య ఎక్కువైంది. అసలు భక్తులెవరో, కానిదెవరో గుర్తించడం కష్టంగా వుంది" అన్నాను ఒక మిత్రునితో.

"అసలు భక్తులు మనకెక్కడ కనిపిస్తారండీ!? వారు ధ్యానంలో మునిగి ఎక్కడో కూర్చుంటారు. భగవంతునిలో ఎలా లీనమవుదామా? అని తాపత్రయపడుతూ వుంటారుగాని - తక్కిన గొడవలు వారికేమీ పట్టవు. నేను భక్తుణ్ణర్రోయి... నన్ను కలుసుకోండర్రోయి.. నా మహిమలు విని తరించండర్రోయి. నేను భగవంతునితో ప్రతినిత్యం వైర్‌లెస్‌లో మాట్లాడుతానర్రోయి.. విష్ణులోకంలోనుంచి మా ఇంటికి టెలివిజన్ వుందర్రోయి. ఆయన అప్పుడప్పుడు సర్దాగా నా దగ్గిరకు వచ్చి మాట్లాడి పోతుంటాడర్రోయి. అంటూ వారేమీ బొబ్బలు పెట్టరు. అసలు వారి ఎడ్రసులే ఎవరికీ తెలియనియ్యరు. కుహనా భక్తులు చేసే గందరగోళం మాత్రం ఇంతా అంతా కాదు" అన్నాడాయన.

***భగవంతుడితో ఏమైనా పనుందా?***

వీరిలో కొందరు "విష్ణుమూర్తితో మీకేమైనా పనివుంటే నాతో చెప్పండి. ఈసారి కలుసుకొన్నప్పుడు ఆయన చెవిలో వేసి చేయించి వేస్తాను. మనం చెపితే ఆయన కాదనడు. ఇంతవరకు లేదు. ఎన్ని పనులు చేయించానాయినగారిచేత? "

పైగా ఆయనే చెపుతూ వుంటారు "పాపం, ప్రజలు నానా అవస్థలు పడుతూ వుంటారు. వారి కష్టాలు తీర్చాలని నాకెంతో కోరికవుంటోంది. చాలామంది డైరెక్టుగా నాతో చెప్పుకోడానికి భయపడతారు - అసలు చెప్పుకోవడం వారికి తెలియదు కూడా. కనుక నీకు తెలిసినవాళ్ళతో ఇంటర్‌వ్యూ చేసి నాకు రిపోర్టు చేస్తూ వుండు. వారి కష్టాలు తొలగించివేద్దాం" అంటాడని కొందరు భక్తులు చెపుతూ వుంటారు.

ఇలాటి కుహనా భక్తుల సంఖ్య పెరిగిపోతుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. చేతనైతే ఆయన నామం ప్రచారం చెయ్యాలి. మహిమలు వర్ణించాలి, పరుల దృష్టి ఆయనవైపు మళ్ళించాలి. అంతేగాని తమకాయన 'ఇంటిమేట్ ఫ్రెండ్' అని ఏ మంత్రిపుంగవుణ్ణి గురించో చెప్పినట్లు చెపితే ఏం బాగుంటుంది?

ఒకవేళ భగవత్ దర్శనం అవుతుందనుకోండి. అలాంటివారు ఆ తన్మయత్వంలో పడిపోయి తాదాత్మ్యం పొందడానికి ప్రయత్నిస్తారుగాని తమ పలుకుబడిని గురించి పదిమందితో చెప్పుకోవాలని ప్రయత్నిస్తారా?

అసలా మహానుభావుడు అంత తేలికగా కనిపిస్తాడా? కనిపించిన తర్వాత జీవులు మామూలు మానవులుగా ఈ భూమిమీద నిలుస్తారా? తమమీద పుట్టలు మొలిచేదాకా ధ్యానంలో మునిగిన వారికిగాని కనిపించని మహానుభావుడు.

***వైకుంఠానికి ఉయ్యాల మార్గం.***

ఏ మడత కుర్చీలోనో పడుకుని సిగరెట్టు కాల్చేవాళ్ళకూ - ప్రక్క యింటి వాళ్ళతో పోట్లాడేవాళ్ళకూ, అఫిడెవిట్ మీద సంతకాలు చేసివచ్చి నిద్రపోయేవారికి, మదమాత్సర్యాలు చంపుకోలేక, భూమినంతా ఏలుదామని, అందమైన వాళ్ళందర్నీ వరిద్దామనీ, అందరి బ్యాంకు ఎక్కౌంట్లూ తమ పేర మార్పించుకొందామనీ, ఆ సొమ్ముతో వైకుంఠానికీ, తనకూ మధ్య ఒక వుయ్యాల మార్గం వేసుకుందామని వుబలాటపడేవారికీ హఠాత్తుగా కనిపించి, కనికరించి వరాలిచ్చిపోతాడా?

భగవంతుని దర్శనమంటే ఒక కథ జ్ఞాపకం వచ్చింది. వెనుకటి ఒక వూళ్ళోకి భక్తుడొకాయన వచ్చాడుట. ఆయన కేవలం కృష్ణభక్తుడట. అందరికీ కృష్ణ దర్శనంచేయిస్తానని వాగ్దానం చేశాడట ఆడా, మగా అందరూ నమ్మారుట.

ప్రతిదినం ఆయనగారికి కావలసిన సపర్యలన్నీ చేస్తున్నారు. ఆయన తన్మయత్వంతో నృత్యం చేస్తూంటే, ప్రజలు కూడా వీధి మధ్యలో చేరి నృత్యాలు చేస్తూండేవారుట. ఆయన మధ్య మధ్యలో "అడుగో అడుగో యదునందునుడు.. అడుగో, అడుగో శిఖిపించమౌళి" అని కేకలు పెట్టేవాడుట.

ఇంకేం వుంది కృష్ణుడు మన దార్లోకి రానేవచ్చాడు. ఆయనకు కనిపించినవాడు మనకు కనిపించడా? అన్న ఆనందంతో మరింత ఎగిరిగంతులు వేసేవారుట. ఈ భక్తబృందంలో స్త్రీలు కూడా పురుషులతోపాటు సమాన సంఖ్యలో వున్నారుట. చాలా నెలలపాటు ఈ నృత్యకేలన జరుగుతోందిట.

***ఎందుకమ్మా అలా ఎగురుతావు?***

ఇలా వుండగా ఒక రోజున భగవంతుని మీద విశ్వాసంగల ఒక సనాతనుడా వూరు వచ్చాడట. భక్తుల నృత్యం చూశాడుట. నలభై యేళ్ళ వయస్సుగల ఒక స్థూలకాయురాల బరువు భారాలన్నీ మరచిపోయి అదేపనిగా ఎగురుతోందిట. ఆ నృత్యం అయిపోయిన తర్వాత సనాతనుడు ఆ స్థూలకాయిరాల్నే పిలిచి "ఎందుకమ్మా అలా ఎగిరావు? " అని అడిగాడు.

"భగవంతుని దర్శనం అయితే ఎగరక ఏం చేస్తాం?" అన్నదిట.

"మరి భగవంతుడు నీకు కనిపించాడా?" అని ప్రశ్న.

ఆవిడ కొంచెం తత్తరపడింది "నాకు కనిపించలేదుగాని, నా ప్రక్కన నృత్యం చేసిన ఆవిడకూ కనిపించాడు" అన్నదిట.

"ఆవిడక్కనిపిస్తే నువ్వెగరడం దేనికి? " అని సనాతుని ప్రశ్న.

"ఏమో మరి. ఎగరాలనిపించింది" అన్నదట ఆమె. ఆ సనాతనుడంతటితో వూరుకోక ప్రక్క ఎగిరిన ఆమెను కలుసుకుని "ఏమమ్మా! భగవంతుడు నీకు కనిపించాడా?" అని అడిగాడట.

ఆవిడ ఒక నిముషం తేరిపార చూచి - "నాక్కనిపించకపోతే ఏం? మా గురువుగారికి కనిపిస్తారు రోజూ. అందుకని మేమూ నృత్యం చేస్తాం" అందిట.

***కనిపించిన తర్వాత ఎగరవమ్మ.***

"అంత తొందరెందుకమ్మా! నీకూ కనిపించిన తర్వాత ఎగరవచ్చుగా? " అని ప్రశ్న.

"బాగుంది. మా గురువుగార్ని ఒక్కరినే ఎగరమంటే ఏం మర్యాద? " అందిట ఆమె చిరుకోపంతో.

"ఆయనతో మీరందరూ ఎందుకమ్మా! స్త్రీలు గదా! ఇళ్ళలో దేవుణ్ణి పెట్టుకుని పూజించండి అది మంచిది. దయవుంచి ఎగరడం మానివెయ్యండి" అన్నాడట సనాతనుడు.

"పదినెలలనుంచీ ఎగురుతున్నాం ఎలా మానెయ్యడం? ఎలా తోస్తుంది? గురువుగారిని చూచినా, తలచుకున్నా తెలియకుండానే ఎగిరిపోతాం" అన్నదట ఆమె.

"వద్దుతల్లీ అలా ఎగిరినంత మాత్రాన ఆ భగవానుడు దర్శనమివ్వడు. చిత్తశుద్ధితో పూజించాలి. జీవితం ధన్యం చేసుకోవాలి" అని సనాతనుడు బోధించాడుట. అక్కడే ఒక వారం రోజులు మకాం వేశాడుట.

క్రమక్రమంగా ఆ భక్తుల గంతులు తగ్గిపోయాయట. ఒక్కడే గంతులు వేయలేక ఆ గురువు మరో వూరు వెళ్ళిపోయాడుట.

విచిత్ర భక్తులకు చెందిన వినోదాలు కొన్నిటిని ఇంకోసారి....

Post your comments